క్లుప్తంగా

ఆరుగురు వలంటీర్లకు మెమోలు

చిప్పగిరి: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆరుగురు వలంటీర్లకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీఓ సుధాకర్ రాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని ఏరూరు గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి జయరాం నాయక్ తమ దృష్టికి తెచ్చారన్నారు. విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలలో భాగంగా మెమోలు జారీ చేశామన్నారు. గ్రామ వలంటీర్లు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ విధులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

గోనెగండ్ల: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సూచించారు. ఆయన బుధవారం మండలంలోని హెచ్.కైరవాడి, కులుమాల గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సచివాలయంలో అందించే పలు రకాల సేవల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సూచించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రామదాసు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూసర్వే పక్కాగా చేపట్టాలి

వెల్దుర్తి: మండలంలో చేపట్టిన సమగ్ర భూసర్వే పక్కాగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ కోరారు. బుధవారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. గొడవలకు తావివ్వకుండా, ఒత్తిళ్లకు లొంగకుండా నిజాయితీగా భూ సర్వే జరపాలన్నారు. ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు పట్టా, పాస్‌బుక్ అందించి, ఆన్‌లైన్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ, అనుబంధ సంఘాల ప్రతినిధులు రాజు, చిన్నమాదులు, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

హొళగుంద: హొళగుంద ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ దాసానాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిజిటల్ అసిస్టెంట్‌కు సలహాలు ఇచ్చారు. పాఠశాలలకు కేటాయించిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థుల ఆధార్ అప్‌డేట్, చేర్పులు, మార్పులు ఇతర పనులు చేస్తున్నట్లు ఆయన విలేకరులకు తెలిపారు. మండలానికి రెండు ఆధార్ సెంటర్లు మంజూరు కాగా హెబ్బటం సెంటర్‌ను హొళగుంద ఎంపీడీఓ కార్యాలయంలో, మరొకటి హొళగుంద సచివాలయం-3లో సేవలందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు రెండవ విడత కొనసాగుతుందని అందులో భాగంగా హొళగుంద కాలేజీలో 130 మంది విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ చేసామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జొన్నగిరిలో జలకళ బోర్లు

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరిలో బుధవారం జలకళ బోరు తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తున్నారు. గత రెండేళ్లుగా మండలంలోని పలు గ్రామాల్లో 451 బోర్లు వేశారు. జొన్నగిరిలో మొదటి విడతగా 19 మంది రైతుల పొలాల్లో జలకళ బోర్లు తవ్వేందుకు అనుమతులు వచ్చినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ సుంకప్ప తెలిపారు.

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు



ములుగుందంలో దస్తగిరి స్వామి అశ్వాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఆస్పరి: కొలిచే వారికి కొంగు బంగారంగా పేరొందిన దస్తగిరి స్వామి 267 ఉరుసు ఉత్సవాలు ములుగుందంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం దస్తగిరి స్వామి గుర్రాన్ని అందంగా అలంకరించి గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామి వారి గుర్రానికి బిందెలతో నీళ్లు పోసి పూజించారు. గుర్రం దర్గాకు చేరే వరకు భక్తులు వెంట నడిచారు. దస్తగిరి స్వామి సమాధిని ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పీర్ల చావిడి నిర్మాణానికి వారు రూ.50 వేలు విరాళం గ్రామ పెద్దలకు అందజేశారు. జెడ్పీటీసీ దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, సీఈఓ అశోక్, నాయకులు సుంకర రామాంజినేయులు, కేశవరెడ్డి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

మస్తానయ్య స్వామి ఉరుసు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో భక్తుల ఇలవేల్పుగా కొలువైన మస్తాన్ వలి స్వామి ఉరుసు మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులాభారం వేయించుకుని స్వామికి చక్కెర చదివింపులు చేశారు. సీఐ మురళీ మోహన్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

గడప గడపలో సంక్షేమ కాంతులు

- వెల్దుర్తిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం
- ప్రతి ఇంటా ఎమ్మెల్యేకు ఘన స్వాగతం



వెల్దుర్తి 15వ వార్డులో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలు గడప గడపకూ చేరుతూ ప్రతి ఇంట సంక్షేమం విరాజిల్లుతోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని 15వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్ అందజేశారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సమస్యలు, తాగునీటి కుళాయిలు ఇలా ప్రజలు లేవనెత్తిన సమస్యలను సంబంధిత అధికారులతో నమోదు చేయించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ మూడేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులందరూ ప్రజల వద్దకు వెళ్లగలిగే సమర్థవంతమైన పాలన సీఎం జగనన్న అందిస్తున్నాడన్నారు. ప్రతి గడపలో తమకు లభిస్తున్న ఆదరణే తమ సంక్షేమ పాలనకు నిదర్శనమన్నారు. టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే వస్తారని, వారు చెప్పే మాయమాటలు నమ్మవద్దని సూచించారు. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత జగనన్న పాలనను బేరీజు వేసుకుని మరోసారి సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

పట్టణంలో రూ.5.77 కోట్లతో నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న 30 పడకల కమ్యూనిటీ ఆసుపత్రిని ఎమ్మెల్యే పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణం గురించి కరెస్పాండెంట్ డాక్టర్ బాలచంద్రారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సరిపడినంత డాక్టర్లు, సిబ్బంది నియామకం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజల బాగోగులు పట్టించుకోలేదని, తమ ప్రభుత్వం ఆసుపత్రుల నిర్మాణాలు, సిబ్బంది నియామకాలు, మెడికల్ కాలేజీలు ఏర్పాటు, ఆరోగ్య శ్రీ ఇలా ఎన్నో రకాలుగా ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. అధునాతన సౌకర్యాలతో 24 గంటలు సేవలందించే వెల్దుర్తి ఆసుపత్రి నిర్మాణంతో వెల్దుర్తి, కృష్ణగిరి, డోన్, కల్లూరు, ఓర్వకల్, బేతంచెర్ల మండలాల ప్రజలకు మంచి వైద్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాలలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఏఓ అక్బర్‌బాష, జెడ్పీటీసీ సుంకన్న, వైస్ ఎంపీపీ రంగడు, సర్పంచ్ ముత్యాల శైలజ, దేవరాజ్ దంపతులు, డాక్టర్లు రంగస్వామి, అలీ సాహెబ్, హేమలత, తులసి, శ్రీవాణి, భారతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

మద్దికెర: శ్రీ మద్దమాంబ రథోత్సవం సందర్భంగా మద్దికెరలో బుధవారం రాష్ట్రస్థాయి వృషభాల రాతి దూలం లాగే పోటీలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. పోటీల్లో 11 జతలు ఎద్దులు పాల్గొన్నాయి. వైఎస్సార్ కడప జిల్లా కీర్తిపేట గ్రామానికి చెందిన వృషభాలు మొదటి బహుమతి రూ.50,116, కొత్తకోట బీఎస్ఎస్ రెడ్డి, నంద్యాల జిల్లా ఎస్.కొత్తురు వృషభాలు రెండవ బహుమతి రూ.40 వేలు, నంద్యాల జిల్లా శివరాంరెడ్డి, కడప జిల్లా బీ.చెర్లోపల్లెకు చెందిన వృషభాలు మూడవ బహుమతి రూ.30 వేలు, అనంతపురం జిల్లా కృష్ణాపురం నాగేశ్వరరెడ్డి వృషభాలు నాల్గవ బహుమతి రూ.20 వేలు, అనంతపురం జిల్లా సోమలదొడ్డి రామసుబ్బారెడ్డి వృషభాలు ఐదవ బహుమతి రూ.10 వేలు, కృష్ణాపురం బాపవగౌడ్ వృషభాలు ఆరవ బహుమతి రూ.6 వేలు గెలుచుకున్నాయి. మద్దికెర శివారు గుంతకల్లు రహదారిలో ఉన్న మైదానంలో నిర్వహించిన పోటీలు ఉదయం నుంచి ఉత్కంఠ భరితంగా సాగాయి. కార్యక్రమంలో నాయులు నాగేంద్ర, ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ బండారు సుహాసిని, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన వారికి గ్రామానికి చెందిన నాగేష్, తిరుపతిరావు అన్నదానం చేశారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

గాయత్రీ మాత ఉత్సవాలు ప్రారంభం

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత 20వ ఆరాధనోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో నిర్వాహకులు రూపామోహన్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి ప్రతిష్ఠ, గరికపూజ, హోమం, పుష్పార్చన, కుంకుమార్చన, పంచధేను గాయత్రి యజ్ఞం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు రామతీర్థంలోని కొలనులో గంగపూజ నిర్వహించి గంగ నీటిని మేళతాళాలతో భక్తులు అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. నిర్వాహకులు శంకరబండ సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయంపై దృష్టి

హొళగుంద: తడి, పొడి చెత్త నుంచి వర్మీ కంపోస్ట్, సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు సబ్సిడీ ధరకు విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సర్పంచ్ చలవాది రంగమ్మ, వైస్ సర్పంచ్ మీనాక్షి సహకారంతో గ్రామంలో సేకరించిన చెత్తతో పంచాయతీరి ఆదాయం పెంచడంతో పాటు పారిశుద్ధ్యం మెరుగు పడేలా చేస్తామన్నారు. వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. సేంద్రియ ఎరువు సిద్ధంగా ఉందని ఆసక్తి గత రైతులు కొనుగోలు చేయవచ్చన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

చిప్పగిరి: మండలంలోని కుందనగుర్తి గ్రామంలో సర్పంచ్ పురుషోత్తం బుధవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్త చెదారం, పూడికను తొలగించారు. గత 15 సంవత్సరాలుగా వినియోగంలో లేని మురుగు కాల్వలను శుభ్రం చేసి వినియోగంలోకి తెచ్చారు.

రోడ్లు, డ్రైనేజీ పనుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు వార్డుల పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. బుధవారం పట్టణంలోని మాచాని సోమప్ప నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో దాదాపు రూ.9 కోట్లతో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. టీపీఓ గోపాలకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యుకె రాజశేఖర్, షబ్బీర్ అహమ్మద్, నాయకులు సునీల్‌కుమార్, కె.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఎస్ నగర్‌లో డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, కమిషనర్

పెండేకల్లు పాఠశాలకు పరీక్ష కేంద్రం హోదా



పెండేకల్లు ఆర్ఎస్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో మాట్లాడుతున్న చంద్రభూషణరావు

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు ఆర్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రం హోదా పొందింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ పరీక్షల జిల్లా సహాయ కమిషనర్ చంద్రభూషణ్ రావు పాఠశాలను సందర్శించి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పాఠశాల అనువుగా ఉందా? అని పరిశీలించారు. అవసరమైన గదులు, కాంపౌండ్ వాల్ తదితర సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది నుంచి పెండేకల్లు ఆర్ఎస్ జెడ్పీహెచ్‌లోనే పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎద్దులదొడ్డి, రామలింగాయపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా ఈ పరీక్షా కేంద్రంలోనే పరీక్షలు రాస్తారన్నారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ తరగతులు కూడా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం గ్రామంలో దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. హెచ్ఎం మైఖేల్, పీఎంసీ చైర్మన్ నాగరాజు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

గోనెగండ్ల: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ వెంకటనారాయణ సూచించారు. ఆయన బుధవారం మండల పరిధిలోని అలువాల, కులుమాల, హెచ్ కైరవాడి గ్రామాల్లో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ.. మండల అధికారులు ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడిన కాలనీలను సందర్శించాలన్నారు. ఇంటి నిర్మాణంలో జాప్యానికి గల కారణాలను తెలుసుకొని లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం సిమెంట్, స్టీలు, ఇసుక అందిస్తుందన్నారు. బిల్లులు కూడా సకాలంలో మంజూరవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఇంటి నిర్మాణం చేపట్టని లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. హౌసింగ్ డీఈ ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, ఏఈ ప్రసాద్, లక్ష్మన్న, విద్యుత్ ఏఈ సుధాకర్‌రావు, ఏపీఎం హేమలత, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



అలువాలలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ వెంకటనారాయణ, అధికారులు

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న పీఆర్ డీఈ శ్రీరాములు

ఆలూరు: రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్ మంజూరు చేసిన రూ.40 లక్షల నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మొలగవెల్లి గ్రామ సర్పంచ్ మోహన్‌రాజ్ బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహన్‌రాజ్ మాట్లాడుతూ.. ఈ నిధులను మంజూరు చేయించిన సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఆలయ అభివృద్ధి అధ్యక్షుడు శివరామిరెడ్డి, లీగల్ అడ్వైజర్ ప్రవీణ్‌కుమార్, సీపీఐ జిల్లా నాయకుడు భూపేష్, మండల కార్యదర్శి రామాంజనేయులు ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం సర్పంచ్ మోహన్‌రాజ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీ ల్యాడ్ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌ను కులమతాలకు అతీతంగా ఉపయోగించుకోవాలన్నారు. పీఆర్ డీఈ శ్రీరాములు, కాంట్రాక్టర్ రఘునాథ్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రస్తా వివాదంపై జిల్లా కలెక్టర్ పరిశీలన



హలిగేరలోని బీసీ కాలనీలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు

ఆస్పరి: హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం ఆస్పరి మండలంలోని హలిగేర గ్రామ బీసీ కాలనీలో నెలకొన్న రస్తా వివాదంపై జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు వాస్తవాలు పరిశీలించడానికి వచ్చారు. రస్తా స్థలం తన సొంతం అంటూ ఓ వ్యక్తి గతంలో కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు జిల్లా కలెక్టర్ బీసీ కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. రస్తా విషయంపై కాలనీ వాసులు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. పరిశీలన నివేదికను హైకోర్టుకు సమర్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. డీపీఓ నాగరాజు నాయుడు, పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్, తహసీల్దార్ కుమారస్వామి, డీఎల్‌పీఓ శ్రీకాంత్ చౌదరి, ఎంపీడీఓ రాధ, ఈఓఆర్డీ సూర్య నరసింహారెడ్డి ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

పత్తికొండ రూరల్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సూచించారు. ఆయన బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మోటివేషన్ కార్యక్రమంలో మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి విద్యార్థులను చదివిస్తున్నారని, వారి కష్టాన్ని గుర్తుంచుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. మార్చి 1వ తేదీ నుంచి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తారని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్, మోటివేషనల్ స్పీకర్ రంగబాబు, ఎస్ఎస్ఏ పీఓ వేణుగోపాల్, పత్తికొండ తహసీల్దారు విష్ణుప్రసాద్, ఎంఈఓ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

గోనెగండ్ల: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయురాలు కృషి చేయాలని ఎంఈఓ వినోద్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థునులకు పలు సూచనలు చేశారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, వెనుకబడిన విద్యార్థినులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించి విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు.

ఈ-కేవైసీ పూర్తి చేయండి

ఆలూరు: దేవనకొండ మండలంలోని 26 గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న ఆర్బీకే సిబ్బంది రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు ఈ-కేవైసీ త్వరితగతిన పూర్తి చేయించాలని ఏఓ సురేష్‌బాబు ఆదేశించారు. మండలంలోని మాచాపురం, కరివేముల గ్రామాల ఆర్బీకేలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఆర్బీకే సిబ్బంది పనితీరు మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఈనెల 12వ తేదీలోగా ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు 4 వేల మంది రైతులు రబీ పంటలను సాగుచేయగా 3,400 మంది నుంచి ఈ-కేవైసీ పూర్తి చేశారన్నారు. వలంటీర్ల సహకారంతో ఈ-కేవైసీ వంద శాతం పూర్తి చేయాలని సూచించారు.

విద్యార్థినికి అభినందన

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని త్రివేణి రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు గోవిందురెడ్డి తెలిపారు. గత నెల 27 నుంచి 29 వరకు కర్నూలులో జరిగిన అండర్-17 బాలికల ఫెన్సింగ్ పోటీల్లో త్రివేణి బంగారు పతకం సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థిని త్రివేణి, ఆమెకు శిక్షణ నిచ్చిన పీఈటీ రామన్నను ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

24 నుంచి నెరణికితండాలో ఉత్సవాలు



నెరణికి తండాలో వెలసిన మునిస్వామి, చౌకాస్వామి

హొళగుంద: నెరణికి తండాలో ఈ నెల 24న మునిస్వామి, చౌకా స్వామిల రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ పారుబాయి, ఎంపీటీసీ సంధ్యాబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవంలో భాగంగా 24న మేటి కుంభోత్సవంతో పాటు రాత్రి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్వామి వారికి జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర ప్రత్యేక పూజలను నిర్వహించి మేటి కుంభోత్సవంతో పాటు పల్లకీ ఊరేగింపు తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. వేడుకల్లో భాగంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. అదేవిధంగా 25న మారెమ్మ దేవర ఘనంగా జరుగుతుందని భక్తులు తరలి రావాలని వారు కోరారు.

గొడవల జోలికి పోవద్దు

ఎమ్మిగనూరురూరల్: గ్రామాల్లో గొడవల జోలికి పోకుండా ప్రశాంత జీవనం సాగించాలని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని కందనాతి గ్రామంలో రూరల్ సీఐ కె.మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ యు.సునీల్‌కుమార్‌లు పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో చిన్న చిన్న విషయాలకు గొడవలు పడవద్దని సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామస్తులు అన్నదమ్ముల వలె కలసిమెలసి ఉండాలని సూచించారు. పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. రూరల్ ఎస్‌ఐ సునీల్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కందనాతి గ్రామసభలో మాట్లాడుతున్న రూరల్ సీఐ కె.మోహన్‌రెడ్డి

అడిగిన వారందరికీ పనులు కల్పించండి

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఏపీఓ అబ్దుల్ షుకూర్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో కూలీలు వలస వెళ్లకుండా పనులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే పనిచేసిన 15 రోజుల్లోగా వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కూలీలకు తెలియజేయాలన్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు వారి పరిధిలోని కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈసీ శేషిరెడ్డి, అన్ని గ్రామాల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అభివృద్ధి పరుగులు



సోమప్ప కూడలిలో ఏర్పాటుచేసిన నందీశ్వరుడి విగ్రహం

ఎమ్మిగనూరు: మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రభుత్వ చొరవతో కోట్ల రూపాయల నిధులతో పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.11 కోట్లలో రూ.7 కోట్ల రూపాయలతో రోడ్ల డ్రైనేజీల నిర్మాణ పనులు, పార్కుల ప్రహరీలు, అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు కోటి రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఒకేసారి 42 పనులు జరుగుతుండటం విశేషం. అదేవిదంగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిధులు రూ.2.4 కోట్లతో జరుగుతున్న మూడు అర్బన్ ఆస్పత్రుల నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయి. పట్టణంలోని ప్రధాన సర్కిళ్లలో డివైడర్ల ఏర్పాటు, మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వల్ల పచ్చదనంతో పాటు స్వచ్ఛతకు రూపుతెచ్చారు. అదేవిధంగా ప్రధాన రహదారుల మధ్యలో ఉన్న డివైడర్లు, సోమప్ప సర్కిల్, సోమేశ్వర సర్కిల్, శకుంతల సర్కిళ్లలో ఆకట్టుకునే ఆకృతులు, పెయింటింగ్‌లు అద్ది కనుల విందుగా మార్చారు. అందులోని ఫౌంటెన్లు, ఆకర్షణీయ మొక్కల ట్రిమ్మింగ్‌తో అందంగా తీర్చిదిద్దారు. పార్కుల్లో మొక్కల పెంపు, మున్సిపల్ కార్యాలయంలో పచ్చదనపు పరవళ్లు తొక్కుతున్నాయి. అభివృద్ధి పనుల్లో వేగం పెంచడం, స్వచ్ఛత, సుందరీకరణకు మెరుగులు దిద్దడం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు.



ఆహ్లాదంగా మారిన మున్సిపల్ కార్యాలయం



అయ్యప్పస్వామి ఆలయ వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు



సోమప్పనగర్‌లో డ్రైనేజీ నిర్మాణం

టెంకాయల విక్రయ హక్కుల వేలం

నందవరం: మహాశివరాత్రి మహోత్సవం పురస్కరించుకొని గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో టెంకాయలు విక్రయించే హక్కుల కోసం వేలం నిర్వహించినట్లు ఈఓ దినేష్ పేర్కొన్నారు. బుధవారం ఆలయ ఆవరణలో ఆదోని డివిజన్ దేవాలయాల ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పెద్ద నరసింహులు ఆధ్వర్యంలో వేలం జరిగింది. వేలం పాటలో గ్రామస్తులు చాకలి నరసప్ప, రాజు, అయ్యపురెడ్డి, వీరేష్, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు. మిట్టసోమాపురం గ్రామానికి చెందిన బొజ్జన్న రూ.1.26 లక్షలకు హెచ్చుపాడి హక్కులు దక్కించుకున్నారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ దేవస్థానం నిబంధనల ప్రకారం టెంకాయలు అమ్ముకోవాలని టెండర్‌దారుడికి సూచించారు. ఆలయకమిటీ నిర్ణయించిన ధర (జత టెంకాయలు) రూ.60కు విక్రయించాలన్నారు. అనంతరం క్యూలైన్లు, జాతరలో మిటాయి కొట్ల ఏర్పాటుకు స్థలాలు, టికెట్ కౌంటర్ల ఏర్పాట్లను ఈఓ పరిశీలించారు. గ్రామ పెద్దలు, నరసింహారెడ్డి, చిన్న నరసింహులు, పరమేష్, హంపేష్ స్వామి, జాన్, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.